# విమోచింపబడినవారు

# (1:7, 8)

ప్రతి ఖండంలోని, ప్రతి దేశంలోను, ప్రతి పట్టణంలోను, ప్రతి కుటుంబంలోను కొన్ని ఉత్సవాలకొరకు ప్రజలు కలుసుకొంటారు. ఉదాహరణకు, ప్రజలు జన్మ దినాలను, వార్షిక ఉత్సవాలను జరుపుకుంటారు. మనం అలంకరించుతాం. మనం కార్డులు, బహుమానాలు కొంటాం. ఆ ఉత్సవాలను అందులో పాల్గొన్నవారిని జ్ఞాపకం చేసికొనడానికి ఫోటోలు తీసుకుంటాం లేక వీడియో టేపులు తీసుకుంటాం.

దేశంగా భారతీయులం ఆయా సెలవు దినాలను, జ్ఞాపకార్థ దినాలను, స్వాతంత్ర్య దినాన్ని, రిపబ్లిక్ దినాన్ని వేడుకగా జరుపుకుంటాం. ఈ ఉత్సవాలలో కుటుంబాలు, స్నేహితులు కలుసుకుంటారు. జెండా ఎగురవేయడాలు, సైనిక విన్యాసాలు వగైరాలు జరుగుతూ ఉంటాయి. ఈ ప్రత్యేకమైన సందర్భాల ద్వారా, దేశంగా మనం ఎక్కడ ఉన్నాం; మనలను యిక్కడికి తెచ్చిందేమి; మనం దేనికొరకు నిలిచియున్నాం; మనం చరిత్రలోనికి ఎలా సరిపోతాం; లేక అమర్చబడతాం అనే విషయాలను జ్ఞాపకం చేసుకుంటాం.

మనం బైబిలు వద్దకు వచ్చినప్పుడు, మన జీవితాలకు అతి ప్రాముఖ్యమైన ఉత్సవం క్రీస్తు ద్వారా దేవుడు మనకు ఏమి చేశాడో అదే అయ్యుండాలని మనం కనుగొంటాం. క్రీస్తు ఎవరైయున్నారు ఆయన మనకు ఏమి చేశాడనేవి – దేవుని ప్రజలు బహిరంగంగా కూడిన ప్రతి కూడికయందును వైభవముతో జరుపు మహోత్సవమై ఉండాలి.

ఆయన క్రీస్తునందు మనకు ప్రసాదించిన సమస్తం కొరకు దేవునికి పౌలు స్తుతి చెల్లిస్తున్నాడు. అట్టి మహోత్సవంతో ఎఫెసీ పుస్తకపు ప్రారంభపు పలుకులు ప్రతి ధ్వనిస్తున్నాయి. 1:3–14లోని ప్రతిపాదన ఆలాటి మహోత్సవంతో పూర్తిగా నిమగ్నమై ఉంది.

“గంభీరమైన బూరధ్వనివంటి” శబ్దంతో, క్రీస్తునందు దేవుడు ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదము అనుగ్రహించాడని మహోత్సవం జరిపాడు (1:3). క్రీస్తునందు దేవుడు తన ప్రజలుగా మనలను ఏర్పరచుకున్నాడని అతడు ఉత్సహించాడు (1:4). దేవుడు మనలను తనకు కుమారులనుగా స్వీకరించాడని ఉత్సహించాడు (1:5). క్రీస్తునందు మనకు కృప ఉచితంగా ప్రసాదింపబడినందుకు ఉత్సహించాడు (1:6).

అటు తరువాత మనము ఈ ప్రత్యేకమైన ప్రతిపాదన వద్దకు వచ్చి చేరుకున్నాం: “దేవుని కృపామహదైశ్వర్యమునుబట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది” (1:7, 8).

విమోచింపబడినవారముగా క్రీస్తునందు మనం ఉత్సహించుతాం. అయితే ఈ మహోత్సవం ఎలా వెల్లడించుకుంటుందో లేక బయలుపరచుకుంటుందో?

## విమోచన యొక్క అర్థాన్ని మనం కొనియాడతాం

"ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము … కలిగియున్నది" (1:7). క్రీస్తునందలి విమోచనమును పౌలు కొనియాడాడు, అయితే విమోచనమంటే అతని భావమేమి? ఇక్కడ రెండు పదాలను జ్ఞాపకం ఉంచుకోవాలి: ఒకటి "స్థితి," రెండవది "వెల."

విమోచింపబడక ముందు మనకున్న స్థితిని గూర్చి విమోచనము కొంతవరకు తెలుపుతుంది. ఒక వ్యాఖ్యానకర్త యిలా అన్నాడు: "మరియొకనికి చెందిన వస్తువును గాని, వ్యక్తినిగాని విడిపించడమనేది విమోచన యొక్క ప్రాథమిక ఉద్దేశమైయుంది."[1]

పాత నిబంధనలో, బానిస యొక్క విడుదలకు చెల్లింపబడిన వెలయే విమోచనము. ఐగుప్తు బానిసత్వంనుండి వారిని విడిపించినప్పుడు దేవుడు ఇశ్రాయేలు కొరకు ఏమి చేశాడో అది విమోచనయై ఉంది. ఒకని ఆధీనంలోనుండి విడిపించబడడం లేక స్వతంత్రులుగా చేయబడడమే విమోచన అంటే. "పాపపు బానిసత్వానికి అమ్మబడిన సంగతిని" గూర్చి పౌలు వ్రాశాడు (రోమా 7:14). క్రీస్తులోనికి రాకముందు మనమున్న స్థితిని విమోచన జ్ఞాపకం చేస్తుంది. పాపము మనకు యజమాని.

విమోచన యొక్క భావాన్ని అర్థం చేసికొనడానికిగాను, మనము ఉండిన పాపపు స్థితిని మొదట మనం అర్థం చేసుకోవాలి. ఆ స్థితిలోనుండి మనలను బయటికి తీసికొని రావడానికి ఏమి కావలసి వచ్చిందో మనం మనస్కరించవలసియుంది. విమోచనకు చెల్లించిన వెల ఎంత? "ఆయన రక్తమువలన మనకు విమోచనము" కలిగియున్నట్టు పౌలు తెలిపాడు. విమోచన చౌకబారైనదికాదు. ఎంత అధికం కావాలో అంత ఖరీదైయింది. "… అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకు" తాను వచ్చియున్నట్టు ప్రభువైన యేసు తెలియజేశాడు (మార్కు 10:45). పేతురు యిలా అన్నాడు: "పితృపారంపర్యమైన మీ వ్యర్థప్రవర్తనను విడిచిపెట్టునట్లుగా వెండి బంగారముల వంటి క్షయ వస్తువులచేత మీరు విమోచింపబడలేదుగాని అమూల్యమైన రక్తముచేత, అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తు రక్తముచేత, విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా" (1 పేతురు 1:18, 19).

క్రీస్తు ప్రభువు "తానే నిత్యమైన విమోచన సంపాదించి, … తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధస్థలములో ప్రవేశించె"నని హెబ్రీ పత్రిక అంటుంది (9:11, 12). దేవుని కుమారుని కఠోరమైన మరణం అనే ఊహాతీతమైన మహా గొప్ప క్రయధనంవలన మనకు విమోచన వచ్చింది.

లోకంలోని ఏదో ఒక మూలన జరిగే అంతరంగ కలహాలు ప్రచురింపగా చూచినప్పుడు, హృదయ వేదన పొందకుండ మనం ఉండలేం. ఏమి జరుగబోతుందో ఎరుగకుండగనే అనుదినం ఆ ప్రాంతంలోని ప్రజలు నిద్ర మేల్కొంటారు. ఆ దినాంతంలో

తిరిగి ఒకరినొకరు కలుసుకుంటారో లేదో తెలియని పరిస్థితిలో ప్రతి ఉదయం తమ దారిని వెళ్లుతూ ఉంటారు. అది భయంకరమైన పరిస్థితి. వారికంటె ఎక్కువ భద్రతగల నావంటి ప్రజలు తమ పరిస్థితిని అభినందించవలసినవారై ఉన్నారు. ఇతరులతో పాటు నేను అనుభవించే ఈ స్థితి ఎక్కువ క్రయధనంతోనే వచ్చింది. ఆర్లింగ్టన్‌లోని జాతీయ సమాధుల దొడ్డివంటి స్థలాల్లో, తెల్లని సిలువల వరుసలు, అమెరికా యుద్ధంలో చనిపోయి పాతిపెట్టబడిన ఆ 1,60,000 మంది ఈ స్వాతంత్ర్యం యొక్క వెలను చెల్లించినట్టు జ్ఞాపకార్థాలుగా నిలిచాయి.

అయితే ప్రభువైన యేసు తన ప్రాణాన్ని మనకొరకు పెట్టాడు. ఆయన కల్వరి గిరికి వెళ్లియుండకపోయినట్టయితే, మనలో ఎవనికిని ఏ నిరీక్షణయు ఉండేది కాదు. మన విమోచనా క్రయధనాన్ని ఆయన చెల్లించాడు. ఆయన మన విమోచకుడై ఉన్నాడు.

ఈ సత్యాన్ని మనం ఏమి చేస్తాం? దాన్ని కేవలం మన మనసులలో దాచుకుంటామా? అప్పుడప్పుడు దానిని ఊరకే జ్ఞాపకం చేసుకుంటామా? విమోచనను గూర్చిన సత్యం మన జీవితాలలో చెప్పుకోదగినంత ప్రాముఖ్యమైన మార్పును తేవాలని ప్రభువు ఉద్దేశిస్తున్నాడు. మనం ఎలాటివారమై ఉండాలని దేవుడు ఎల్లప్పుడు ఉద్దేశించాడో – అలాటివారమైయుండాలని – తనను ఘనపరచే ప్రజలు, తనకు విధేయులయ్యేవారు, తనను ప్రేమించువారు, తనయందు ఆనందించేవారు, తనను స్తుతించేవారై ఉండాలని – ఆయన మనలను విమోచించాడు. తన సంకల్పానికి వ్యతిరేకంగా నేను వెళ్లి పాపంలో జీవించినప్పుడు, ఆయన సిలువ మరణం ఎన్నడూ జరుగలేదని; దానికి ఏ అర్థం లేదని; అది ఆలోచింపదగినదే కాదని; ఆయన రక్తము కార్చి నా కొరకు చనిపోయినా ఏమీ ఫరవాలేదని – నేను జీవింపగోరతానన్న మాట.

ఎక్కడుండాలని దేవుడు మనలను కోరుకున్నాడో అక్కడ ఉంచడానికి – నరక కూపానికి వెలుపట, పరలోకానికి సిద్ధపడి ఉండేలా – క్రీస్తు ప్రభువు క్రయధనాన్ని చెల్లించాడనేదే విమోచనకు అర్థమైయుంది.

## విమోచనా ఫలితాలను మనం కొనియాడతాం

"ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది." విమోచన యొక్క ప్రతిఫలము పాపక్షమాపణయై ఉంది.

"పాపక్షమాపణ" అనే నామవాచకం (గ్రీకు.: *aphesis*) "పంపివేయు, వెళ్లిపోవునట్లు ఆజ్ఞాపించు" అనే అర్థమిచ్చునట్టి క్రియావాచకంనుండి వచ్చింది. దేవుడు మన పాపములను పంపివేస్తాడు. అవి యికమీదట దేవునికిని మనకును మధ్య నిలిచియుండవు.

పాత నిబంధన క్రింద జీవించినవారికి విడిచిపెట్టు మేక ఉండేది. ప్రాయశ్చిత్త దినాన, ప్రధాన యాజకుడు, ప్రజల పాపాలను ఆ మేక పిల్లమీదికి బదిలీ చేసినట్టు గురుతుగా దానిపై తన చేతులుంచుతాడు. అది తిరిగి ఇశ్రాయేలు శిబిరం మధ్యకు రాకుండునట్టు, దానిని తీసికొనిపోయి కానని దూరంగా అడవిలో విడిచిపెట్టుతారు. మేకపిల్ల వెళ్లిపోయినట్టే పాపాలు కూడా వెళ్లిపోయాయ్ (లేవీయ. 16).

యేసుక్రీస్తు మనకు విడిచిపెట్టు మేక పిల్లయై ఉన్నాడు. ఆయన మన దోషమును తనపై వేసికొని, దానికొరకైన శిక్షను ఆయన అంగీకరించాడు:

> యెహోవా మన యందరి దోషమును అతనిమీద మోపెను (యెషయా 53:6).
>
> ఎందుకనగా మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను (2 కొరింథీ. 5:21).
>
> ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను (1 పేతురు 2:24).

తమ మత సంబంధమైన నమ్మకాలను గూర్చి ఒకప్పుడు కొందరు ప్రశ్నింపబడ్డారు.[2] అప్పుడు పరలోకము నరకము అనేవాటిని గూర్చి పలు వ్యత్యాసమైన అభిప్రాయాలను వారు వ్యక్తపరచారు. జవాబిచ్చినవారిలో అధిక సంఖ్యాకులు వ్యక్తపరచిన ఆలోచన యిలా ఉంది: "నీ నిత్యత్వం ఎక్కడ గడపబోతావో అనేది నీవెంత మంచివాడవో అనేదానిమీద ఆధారపడియుంటుంది." మరోవిధంగా చెప్పాలంటే, ఒక వ్యక్తి తొందరలలో చిక్కుకొనకుండ, బాధ్యతలను నెరవేర్చుతూ, జనులను బాగా ట్రీట్ చేస్తూ, చెడ్డకంటె అతని గూర్చి ఎక్కువ మంచి చెప్పబడుతున్నట్టయితే, అప్పుడు ఆ వ్యక్తి పరలోకానికి వెళ్లతాడట.

అలాటి భావన బైబిల్లో కన్పించదు! పరలోకానికి వెళ్లడానికి తగినంత మంచితనం గలవాడు ఎవడూ లేడని బైబిలు బోధిస్తుంది. "నీతిమంతుడు లేడు, ఒక్కడైనను లేడు" (రోమా 3:10). "అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు'' (రోమా 3:23); ''పాపమువలన వచ్చు జీతము మరణము'' (రోమా 6:23).

మంచితనం మనిషిని పరలోకానికి తీసికొనిపోతుందనే అభిప్రాయాన్ని ఆ మూడు వచనాలే కొట్టిపారవేస్తాయి. నీ పాఠశాల అంతటిలో నీవు బహు ఖ్యాతికెక్కిన విద్యార్థివే కావచ్చు, మాదిరి పౌరుడుగా పట్టణ సంబంధమైన క్లబ్బుచే నీవు ఎన్నిక చేయబడి ఉండవచ్చు, ఇతరుల అక్కరల విషయంలో దయగల వ్యక్తిగా మీ స్థానిక సంఘంలో గుర్తింపబడియుండవచ్చు, (పరలోకానికి సంబంధించి) నీ గుర్తింపులో విశేషమేమీలేదు. ప్రాథమికంగా మంచివాడవైయున్నట్టు నిన్ను నీవు చూచుకున్నంత మాత్రాన నీవు పరలోకంలో ప్రవేశించలేవు. అందుకు తగినంత మంచివాడెవడు మనలో లేడు. మన పాపాలు ఆ విషయాన్ని తేల్చివేశాయి.

నేను పాపం చేసిన తొలిసారి, మొదటిసారి నీవు పాపం చేసినప్పుడే మన మంచితనంచేత పరలోకం వెళ్లడం అసాధ్యంగా చేయబడింది. పాపిని "పాపం" లేనట్టు మనలో ఎవడును ఏమియు చేయనేరడు.

ఇతరులకు మనం ఎంత మంచిగా కన్పించినా, దేవునికి మాత్రం మనం అంగీకారంగా ఉండము. దేవునికి అంగీకారమయ్యేలా మనలను మనమే చేసికోలేం. మనలను క్షమించుట ద్వారా దేవుడు తానే ఈ పని చేశాడు. మన పాపములను

పంపివేయుట ద్వారా ఆయన ఈ పనిని చేశాడు. అందువలన విమోచనకు ప్రతిఫలమైన – పాపక్షమాపణను మనం కొనియాడతాం (కొనియాడాలి).

## విమోచన యొక్క పరిమాణాన్ని మనం కొనియాడతాం

"**దేవుని కృపామహదైశ్వర్యమునుబట్టి** ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగి యున్నది" (1:7, 8; ఒత్తి పలకడం నాది). మన క్షమాపణ యొక్క విస్తారతను మరియు సంపూర్ణతను పౌలు దృఢపరచాడు. హద్దులు లేని దేవుని కృపామహదైశ్వర్యం మన జీవితాలలో పొర్లిపారునట్లుగా మన క్షమాపణ యొక్క పరిమాణము విస్తరింపజేయబడింది.

తన కృపామహదైశ్వర్యాన్ని బట్టి దేవుడు మనలను విమోచిస్తాడు, మన పాపములను క్షమిస్తాడు. దీనికని దేవునికి ఒక భాగమేమీలేదు. అంటే ఒక వ్యక్తికి యిన్ని "పెద్ద" పాపాలు మించకూడదనే క్వాటా పద్ధతి ఏది ఆయనకు లేదు. వాస్తవంగా, "పాపమెక్కడ విస్తరించెనో అక్కడ కృప అపరిమితముగా విస్తరించెను" (రోమా 5:20). దేవుని కృప చేరలేనంత అధికంగా ఏ నరుడు పాపం చేయలేడు. ఆయన కృప చేపట్టలేనంత (పరిష్కరించ లేనంత)గా మన పాపాలు అంత ఘోరమైనవిగాని, అసంఖ్యాకములుగాని కానేరవు.

ఇంతకు సత్యమిది: నీవు ఎంత తీవ్రంగా కృషి చేసినా, మంచితనం నిన్ను పరలోకానికి తీసికొనిపోదు; నీవు నీ నమ్మిక యేసునందు ఉంచినట్టయితే, ఎంతటి నమ్మశక్యంకాని పాపమైనా పరలోకంనుండి నిన్ను మినహాయించదు.

థోమ్ లెమ్మన్స్ ఒక నవలు వ్రాశాడు. అది తన పాపాలను మొదటి శతాబ్దానికి, క్రీస్తు సిలువ కాలానికి, దానివెంట వచ్చిన సంవత్సరాలకు తోడుకొనిపోయింది. అందులో ప్రధాన పాత్రధారి, లైనస్ అనే ఒక వడ్రంగి. నజరేతువాడైన విప్లవ బోధకుని సిలువ వేయడానికి ఒక సిలువను తయారు చేయుమని ఆజ్ఞాపిస్తూ ఒకరాత్రి తటాలున అతడు మేల్కొల్పబడ్డాడు. అతడు దాన్ని తయారు చేశాడు. తరువాత అదే రోజున తాను చేసిన సిలువపై రక్తం చిందించి నజరేయుడైన యేసు చనిపోయినట్టు లైనస్ నిలిచి నేరుగా తిలకించాడు.

దోషం అతన్ని ముంచివేసింది. అతడు యెరూషలేమునుండి పారిపోయి, సత్యము, జీవము అనే రెండింటికొరకు వెదకనారంభించాడు. సంవత్సరాల తరువాత కూడా, ఆ గలిలయ బోధకుడు చనిపోతున్న దృశ్యం అతన్ని వెంటాడుతునే ఉంది. తార్సువాడైన సౌలు అనే ఒకని లైనస్ కలుసుకుంటాడు. ఊహించబడిన ఆ కూడికలో, లైనస్, సౌలు అనేవారు యిలా సంభాషించుకున్నారు:

> "నేను దోషిని – ఆయన రక్తం విషయంలో నేను నేరుగానే దోషిని, (ఆయన) నిర్దోషియని నేనెరుగుదును, అలాగే భావించాను కూడా. అయినా నేను –" ఆ నిర్దోషియైన మనిషి యొక్క రక్తంచేత అతని మనస్సు నిమగ్నమైనదై మాట్లాడడానికి కూడా అతనికి మాటలు దొరుకక ఆగిపోయాడు.

> “నేను చేసిన సిలువమీదనే ఆయన చంపబడ్డాడు” అంటూ అవమానము, తడబాటుతో బొంగురుపోయిన స్వరంతో చివరికి మెల్లగా పలికాడు. “నాకు తెలుసు, అయినా నేను సమ్మతించాను.”
>
> అంటూ సౌలు మీదికి వంగి అతని ముంజేతిని పట్టుకున్నాడు. “వ(డ్రంగీ, ... నీకంటే యిందులో నాకే ఎక్కువ దోషముందని తప్పక నేను ఊహిస్తున్నాను. అయితే మనలో ఎవడును ఆయన మరణంలో భాగస్థులం కాకుండ తప్పించుకోలేం. లైనస్ నీకిది అర్థం కాలేదా? ఎప్పుడు జీవించినా, ఎప్పుడు జీవించనైయున్నా, ప్రతివానికొరకు ఆయన పస్కా పశువు, లోక పాపమంతటికొరకు, ఒక్కసారే వధింపబడిన గొర్రెపిల్ల.”
>
> లైనస్ కండ్లలోనుండి వేడిగా కన్నీళ్లు రాలనారంభించాయి. చేసిన దానికి తన్ను తానే ఒప్పుకోలేని స్థితిలో అతడు తన తలను ఊగిసలాడించాడు.
>
> “స్నేహితుడా, నీవు దాన్ని ఈ విధంగా ఆలోచిస్తున్నావా,” నీవు ఆయన మరణానికి తోడ్పడినట్టయితే, “యావత్తు సృష్టికి అది నూతన జీవంకొరకు కూడా తోడ్పడింది. లైనస్, నీవు కేవలం సిలువను మాత్రమే నిర్మించలేదు, నీవు ఒక బలిపీఠాన్ని కూడా నిర్మించావు” అని సౌలు అన్నాడు.[3]

దేవుని కృప దాని విషయమై ఏమి చేయలేనంత శక్తిహీనమైనది కాదని, మన పాపం ఎంతయైనా, అది ఎంత ఘోరమైనదైనా దేవుని కృప ఆవరింపలేనంతగా పాపం చేయలేమని సిలువ స్థిరపరచుతోంది. మనుష్యులు పరిపూర్ణుడగు దేవుని కుమారుని పట్టుకొని, బట్టలు విప్పి కొట్టి, కొయ్య సిలువపై ఆయనను వ్రేలాడదీసి, సాధారణమైన నేరస్థుడు చనిపోయేలా విడిచిపెట్టారు. ఆయనను అవమానపరచడానికి, గాయపరచ డానికి, యేసును లయపరచడానికి వారికి చేతనైనదంతా చేశారు. అయినా దేవుని కృప వారి పాపముల కంటె ఎంతో గొప్పది. యేసుకు వారు చేసిన దానినంతటిని దేవుడు తీసికొని, ఆయన రక్తము ద్వారా పాపక్షమాపణను సాధ్యం చేశాడు.

## ముగింపు

నీవు విమోచన యొక్క మహోత్సవంలో చేరావా లేక జతకూడావా? మంచితనం నిన్ను పరలోకానికి తోడుకొని పోదని జ్ఞాపకముంచుకో. పరలోకానికి వెళ్లడానికి ఒకే మార్గం క్రీస్తునందుండడం. నీవు క్రీస్తునందున్నావా? నీ జీవితాన్ని ఆయనకు సమర్పించుకో. మరో దినానికి దీన్ని నెట్టివేయకు!

విమోచన యింకను నిజమయ్యే ఉంది. పాపక్షమాపణ యింకను ప్రసాదింపబడుతుంది. కృప యింకను వెంబడిస్తుంది.

---

సూచనలు

[1]Francis Foulkes, *The Epistle of Paul to the Ephesians,* The Tyndale New Testament Commentaries, rev. ed., gen. ed. Leon Morris (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1989), 58. [2]“Hell’s Sober Comeback,” *U.S. News & World Report* (25 March 1991): 56. [3]Thom Lemmons, *Once Upon a Cross* (Sisters, Oreg.: Multnomah Books, 1993), 304.